నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI


## సాగర్‌కు భారీగా వరద

**2,57,634 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల**



నందికొండ, ఆగస్టు 29 : నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 2,57,634 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో గురువారం సాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,10,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ ద్వారా 8,280 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9,274 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27080, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 (312.50 టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీరుంది.

# ఆధ్యాత్మికత.. సంస్కృతికి యాదాద్రి భువనగిరి ఎంతో ప్రసిద్ధి

**జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన**

- కొలనుపాక ఆలయాలు, స్వర్ణగిరిని దర్శించుకుని భక్తి పారవశ్యం
- కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, అవార్డు గ్రహీతలతో ముఖాముఖి
- జిల్లాకు రావడం సంతోషంగా ఉంది.. మరోసారి వస్తా : గవర్నర్

**యాదాద్రి భువనగిరి జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం విస్తృతంగా పర్యటించారు. పురాతన ఆలయాలు, చారిత్రక మందిరాలను దర్శించుకున్నారు. స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3.03గంటలకు కొలనుపాకకు చేరుకున్న గవర్నర్ రాత్రి 9 గంటల వరకు ఆరు గంటలపాటు జిల్లాలోనే ఉన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వేద పండితులు ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలతో నిర్వహించిన ముఖాముఖిలో గవర్నర్ పాల్గొన్నిముచ్చటించారు.**

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ)



కొలనుపాక సోమేశ్వరాలయంలో పురాతన శాసనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### కొలనుపాకలో జైన మందిరం, సోమేశ్వరాలయం సందర్శన

జనగాం పర్యటన ముగించుకుని గవర్నర్ జిష్ణుదేవ్ నేరుగా ఆలేరు మండలంలోని కొలనుపాకకు చేరుకున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హన్మంతు కే జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. తొలుత జైన మందిరాన్ని సందర్శించిన గవర్నర్ ఆ పరిసరాల్లో కలియదిరిగారు. మందిరం చరిత్ర, కట్టడాల ప్రత్యేకతలను నిర్వాహకులు వివరించారు. 3.30 గంటలకు సోమేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు బతుకమ్మలు, బోనాలు, కోలాటాలతో మహిళలు, పూర్ణకుంభంతో వేద పండితులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ అభిషేకం చేశారు. మ్యూజియం, శాసనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అర్చకులు జిష్ణుదేవ్ వర్మకు ఆశీర్వచనాలు అందించి.. చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లగా.. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ స్వాగతించారు. వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేంకటేశ్వరుడికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదిమూల మహాగణపతి, కన్యకాపరమేశ్వరి, హనుమాన్ విగ్రహాన్ని దర్శించుకున్నారు. స్వామివారి గంటను మోగించారు. జలనారాయణుడి విగ్రహం వద్ద పూజలు చేశారు. కల్యాణ మండపాన్ని సందర్శించి నిర్మాణ వివరాలు తెలుసుకున్నారు.

### రచయితలు, కళాకారులు, అవార్డు గ్రహీతలతో ముఖాముఖి

స్వర్ణగిరి నుంచి గవర్నర్ యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి.. రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ హనుమంత్ కే జెండగే జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు మన్నె గోపాలరెడ్డి, పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్‌ను గవర్నర్ వారి వద్దకే వెళ్లి శాలువాలతో సత్కరించారు. రాత్రి 8.05 గంటలకు ముఖాముఖి ముగియగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే గంగాధర్ వందన సమర్పణ చేశారు. గవర్నర్ అక్కడే భోజనం చేసి రాత్రి 9గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. సమావేశంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ జె.భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాకు మళ్లీ వస్తా : గవర్నర్ జిష్ణుదేవ్

ఆధ్యాత్మికంగా, సంస్కృతిపరంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎంతో ప్రసిద్ధి చెందిందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. జిల్లాలో పద్మశ్రీ అవార్డులు పొందిన వారు ఎక్కువగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చేనేత సంస్కృతి చాలా గొప్పదని, చేనేత రంగంలో జిల్లా ప్ర పంచ ప్రసిద్ధి గాంచిందని, చేనేతను అందరూ ప్రోత్సహించాలని అన్నారు. జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందని, మళ్లీ ఒకసారి వస్తానని చెప్పారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయడం అభినందనీయమన్నారు.

#### ప్రొటోకాల్ మరిచి.. కాంగ్రెస్ నేతల అత్యుత్సాహం

గవర్నర్ కార్యక్రమం అంటేనే రాజకీయాలకు అతీతం. ప్రత్యేకంగా ప్రొటోకాల్ ఉంటుంది. కానీ జిల్లాలో జరిగిన గర్నవర్ పర్యటన కాంగ్రెస్ శ్రేణులతో కొనసాగింది. కొంతమందికే ఆహ్వానం ఉందని అధికారులు చెప్పినా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హంగామా చేశారు. స్వర్ణగిరి ఆలయం వద్ద చుట్టూ కాంగ్రెస్ నేతలే కనిపించారు. కలెక్టరేట్‌లో ఎక్కడ చూసినా వారే. అడిషనల్ కలెక్టర్ సీసీ చాంబర్లు కాంగ్రెస్ శ్రేణులతో నిండిపోయాయి. ముఖాముఖి కార్యక్రమంలో పలువురు కనిపించారు. గతంలోనూ పలు అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హంగామా చేశారు. అధికారులు సైతం పట్టించుకోపోవడం గమనార్హం.

#### కవులు, కళాకారులు, వివిధ అవార్డు గ్రహీతలకు అవమానం

కలెక్టరేట్‌లో నిర్వహించిన గవర్నర్ ముఖాముఖి కార్యక్రమంలో కవులు, కళాకారులు, వివిధ రంగాల అవార్డు గ్రహీతలకు అవమానం జరిగింది. సుమారు 20 నుంచి 30 మంది ప్రముఖులను ఆహ్వానించగా, ముగ్గురు, నలుగురికి మాత్రమే సన్మానం చేసి చేతులు దులుపుకున్నారు. కనీసం వారిని పరిచయం చేయలేదు. మాట్లాడే అవకాశం కల్పించలేదు. ఐదు రోజులుగా తమను సిద్ధంగా ఉండమని చెప్పి, ఆఖరికి తుస్సుమనుపించారని చెప్పుకొచ్చారు. గవర్నర్ కార్యక్రమానికి ఐదు గంటలపాటు వెయిట్ చేయించి, తమను పట్టించుకోలేదని సదరు ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. భోజన కార్యక్రమం సమయంలోనూ గందరగోళంగా ముగించారని వాపోయారు. పాల్గొన్న వారిలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, కాళోజీ అవార్డు, తెలంగాణ యువ పురస్కారం, జాతీయ ఉత్తమ రచయితలు, కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీతలు తదితరులు ఉన్నారు.





యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, అవార్డు గ్రహీతల సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్, చిత్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హన్మంతు కే జెండగే



జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

## సూర్యాపేట జిల్లాకు జ్వరం

**29 రోజుల్లో 406 డెంగ్యూ కేసులు**

- ప్రతి ఇంట్లో జ్వర పీడితులే..
- రోగులతో కిటకిటలాడుతున్న దవాఖానలు
- ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ

సూర్యాపేట, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో వైరల్ ఫీవర్, డెంగ్యూ కేసులు విపరీతంగా నమోదు అవుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. దాదాపు ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. నొప్పులతో గోస తీస్తున్నారు. గత 29 రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా 406 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇక, వైరల్ ఫీవర్ కేసులు లెక్కకు అందని పరిస్థితి.

వర్షాకాలం జ్వరాలు సహజమే అయినా.. ఈసారి పరిస్థితి విపరీతంగా ఉంది. గత పదేండ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు కనిపించలేదు. బీఆర్ఎస్ సర్కారు పల్లెప్రగతి పేరిట గ్రామాలకు నెల నెలా నిధులు కేటాయించి పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో వైపర్ ఫీవర్లు పెద్దగా నమోదు కాలేదు. పల్లెలు, పట్టణాల్లో దోమల మందు కూడా క్రమం తప్పకుండా చల్లేవారు. ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. దోమల మందు ఎక్కడా కొడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా దోమల వ్యాప్తి పెరిగి జనం జ్వరాల బారిన పడుతున్నారు. సూర్యాపేట జిల్లాలో ఈ నెలలో ఇప్పటివరకు 406 డెంగ్యూ కేసులు నమోదవడం పరిస్థితిని తెలుపుతున్నది. వైరల్ ఫీవర్ కేసులకు అంతే లేదు. వాతావరణ మార్పులు, పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారుతున్నాయి. ఏ దవాఖానలో చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి అంటూ అవస్థ పడుతున్నారు.

### ప్రైవేట్‌లో దోపిడీ

వైరల్ ఫీవర్లతో ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతున్న జనాన్ని ప్రైవేట్ దవాఖానలు ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయి. జ్వరమని దవాఖానకు వెళ్లిందే ఆలస్యం అవసరం ఉన్నా, లేకుండా అడ్డగోలు టెస్టులు రాస్తున్నారు. ఇబ్బడి ముబ్బడిగా మెడిసిన్ ఇస్తున్నారు. డెంగీ వచ్చిందని ప్లేట్‌లెట్స్ ఎ క్కించాలనే పేరుతో అందిన కాడికి దండుకుంటున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ధికారులు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి దోపిడీని అడ్డుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిక తనికీలు చేస్తూ వైద్యులను అప్రమత్తం చేస్తున్నా.. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి.





### జ్వరం రాగానే టెస్టులు వద్దు



గత పదేండ్లలో ఈస్థాయిలో జ్వరాలు లేవు. వంద మంది ఆసుపత్రికి వస్తే 95 మంది జ్వరంతోనే వస్తున్నారు. జ్వరం వచ్చిన 24 గంటల తరువాతే ఏ టెస్టు అయినా చేయాలి తప్ప వెంటనే అవసరం లేదు. కొందరు నేరుగా లాబ్‌కు వెళ్లి అనేక టెస్టులు చేసుకొని రిపోర్టుల కట్టతో వస్తున్నారు.. అది కరెక్ట్ కాదు. జ్వరం వచ్చిన వెంటనే అది డెంగ్యూ అయినా సరే టెంపరేచర్‌ను బట్టి ప్రతి ఆరు గంటలకు ఒక పారాసిటమాల్ గోలి వేసి, అవసరమైతే శరీరం డీహైడ్రేషన్ కాకుండా గ్లూకోజ్ పెడితే సరిపోతుంది. ఏ జ్వరమైనా భయపడాల్సిన పని లేదు. కానీ జాగ్రత్త తప్పనిసరి. ప్రధానంగా నిల్వ నీటిలో ఉండే దోమలు కుడితే డెంగ్యూ వస్తుంది. అందుకని పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. పూల తొట్లు, కూలర్లు, ఖాళీ సీసాలు, టైర్లు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి.

**- రామ్మూర్తి, జనరల్ ఫిజీషియన్**


నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
విలేకరులు కావలెను
తెలంగాణ ప్రజల విశేష ఆదరణ పొందిన ప్రముఖ దిన పత్రిక 'నమస్తే తెలంగాణ' లో పనిచేయుటకు విలేకరులు కావలెను. సామాజిక స్పృహ, అంకితభావంతోపాటు తెలుగు భాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపట్ల అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో రాత పరీక్షకు హాజరు కాగలరు. జర్నలిజంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
పరీక్ష తేది :
31-8-2024, శనివారం, ఉ॥ 11 గంటల నుంచి 12 గంటల వరకు
స్థలం : నమస్తే తెలంగాణ టౌన్ ఆఫీస్, L.P.T.మార్కెట్, 1st Floor, Hyd Road. నల్లగొండ
పని చేయవలసిన డేట్‌లైన్లు
నల్లగొండ జిల్లా: దేవరకొండ, చండూరు, వేములపల్లి
యాదాద్రి భువనగిరి జిల్లా: భువనగిరి సిటీ, ఆలేరు టౌన్
సూర్యాపేట జిల్లా : ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, నాగారం, గరిడేపల్లి, తుంగతుర్తి
వివరాలకు : 91827 77972




భువనగిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

## రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, గ్రామ సభల ద్వారా టెక్నికల్ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. సంపూర్ణ రుణమాఫీ డిమాండ్‌తో గురువారం భువనగిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ సగం మంది రైతులకే మాఫీ అవడం వల్ల మిగిలిన వారు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు మానుకుని బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నదని తెలిపారు. రుణమాఫీ కోసం రూ. 45 వేల కోట్లు అవసరమని అంచనా వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రూ. 31 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పి.. రూ. 18 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. రేషన్ కార్డులు, ఐటీ రిటర్న్స్, రీ షెడ్యూల్ వంటి వాటిని సాకలను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఒక్కసారి కూడా రైతు భరోసా నగదు విడుదల చేయలేదని మండిపడ్డారు. ఆందోళనలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు గౌడ్, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు నాయకులు దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ , రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## గురుకులాలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి

- కొండభీమనపల్లి గురుకులం ఎదుట బీఆర్ఎస్వీ ధర్నా
- ఎలుకలు కరిచిన పిల్లలతో మాట్లాడి సమస్యలపై ఆరా

దేవరకొండరూరల్, ఆగస్టు 29 : దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎలుకలు కరిచిన 13 మంది విద్యార్థులను బీఆర్ఎస్వీ నాయకులు గురువారం పరామర్శించారు. గురుకులంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ గురుకుల పరిసరాలు పరిశుభ్రంగా లేక పోవడం వల్ల ఎలుకల బెడద తీవ్రంగా ఉందన్నారు. వసతులు, కరెంట్ బోర్డులు, బాత్‌రూమ్‌లు, కిటికీలు సరిగ్గా లేవని తెలిపారు. ప్రభుత్వం స్పందించి గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించి, అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పి.లక్ష్మణ్, రమేశ్, గుండాల వెంకట్, విక్కీ, హరికృష్ణ, వెంకటేశ్, గోపి, శ్రీను, అనిల్, రవి పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కూడా బాధిత విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కేసీఆర్ సర్కారులో సకల సౌకర్యాలతో ఓ వెలుగు వెలిగిన గురుకులాలు నేడు కాంగ్రెస్ పాలనలో సమస్యల కూపంగా మారాయన్నారు. విద్యార్థులపై ఎలుకలు దాడి గురుకులాల పరిస్థితిని, కాంగ్రెస్ పాలనను తేటతెల్లం చేస్తున్నదని మండిపడ్డారు.

## భువనగిరిలో నేడు నీటి పారుదల పనులపై సమీక్ష


- హాజరుకానున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం జిల్లాకు రానున్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నీటి పారుదల ప్రాజెక్టుల పనులపై భువనగిరిలోని న్యూడైమెన్షన్ స్కూల్ గ్రౌండ్‌లో అధికారులతో సమీక్ష సమీక్షించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకుని సమీక్ష అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు హుజూర్‌నగర్ నియోజకవర్గానికి బయలుదేరి వెళ్లనున్నారు. సమీక్షలో పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొననున్నారు. ఆ మేరకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు.

## ఇగ్నో కోర్సులకు దరఖాస్తులు

- హైదరాబాద్ రీజినల్ అడిషనల్ డైరెక్టర్ రమేశ్

రామగిరి, ఆగస్టు 29 : ఇగ్నో యూనివర్సిటీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ హైదరాబాద్ రీజనల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేశ్ సూచించారు. నల్లగొండలోని కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇగ్నో స్టడీసెంటర్‌ను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. నల్లగొండ స్టడీసెంటర్‌లో డిగ్రీలో బీఏ, బీఏ సైకాలజీ, బీఏ ఇంగ్లిష్, బీఏ ఉర్దూ బీకాం జనరల్, కంప్యూటర్‌సైన్స్, బీఎస్సీ, పీజీ ఎంఎస్‌డబ్ల్యూ, ఇంగ్లిష్, ఎంఎస్‌డబ్ల్యూ, కోర్సులతోపాటు డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో ఉచిత ప్రవేశం ఉందన్నారు. తరగతుల నిర్వహణ నల్లగొండలో ఉంటుందని, పరీక్షలు హైదరాబాద్‌లో రాయాల్సి ఉంటుందన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాలకు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాసులును 9985525003లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి, అమృతారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ
పదవీవిరమణ శుభాకాంక్షల ప్రకటనలు

మీ బంధువులు, స్నేహితులు, మీ శ్రేయోభిలాషులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా..?
అయితే మీ శుభాక్షరాల శుభాకాంక్షలను
నమస్తే తెలంగాణ ద్వారా ఒక తీపి గుర్తుగా అందించండి... ఆనందించండి...
ప్రకటనలకై సంప్రదించండి...
25% DISCOUNT
5% GST EXTRA
సెల్: 9182777625
నల్లగొండ : 9182777635
సూర్యాపేట : 9182777630
మిర్యాలగూడ : 9182777059
భువనగిరి : 9182777638
కోదాడ : 9182777059
హుజూర్‌నగర్ : 9182777059
దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
చౌటుప్పల్ : 9182777638